## రజతోత్సవ సభకు ఉత్సాహంగా తరలివెళ్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, ఏప్రిల్ 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో ఎల్కతుర్తిలో తలపెట్టిన బీఆర్ఎస్ ఆవిర్భావ రజతోత్సవ సభకు గ్రామాల నుంచి ఉద్యమ స్ఫూర్తితో ఉత్సాహంగా తరలివెళ్దామని నాఫ్స్ కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని మల్లారెడ్డిపేటలో గురువారం పార్టీ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసుకున్న ముఖ్య నేతల సమావేశానికి వారు హాజరై దిశానిర్దేశం చేశారు. ఇంటికొకరు వచ్చేలా కార్యచరణ రూపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామి గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, లింగన్న గారి దయాకర్‌రావు, సుతారి బాలవ్వ, రాజేందర్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

## సభను విజయవంతం చేద్దాం



శాత్రాజుపల్లిలో బీఆర్ఎస్ నాయకులతో మాట్లాడుతున్న కేడీసీసీబీ డైరెక్టర్ ఏనుగు తిరుపతిరెడ్డి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 24 : ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కేడీసీసీబీ డైరెక్టర్, ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి 1,2,3 వార్డు ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరుకావాలన్నారు. ప్రతి వార్డు నుంచి వాహన సౌకర్యం కల్పించామని, ఉదయం వార్డులో జెండావిష్కరణ అనంతరం సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, వార్డు పార్టీ అధ్యక్షులు నల్ల సతీశ్‌రెడ్డి, గుడిసె అనిల్, మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాస్, గుడిసె సదానందం, మెట్ట దేవానందు, జనార్దన్ రెడ్డి, సంతోష్‌రెడ్డి, పురుషోత్తం, మనోజ్, సుధగోని బాలయ్య, కొమురయ్య, రామచంద్ర, అబ్దుల్ ఖయ్యూమ్, గోరెమియా, స్వామిరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తా తరలి రావాలి



ముస్తాబాద్, గూడెం గ్రామంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కొమ్ము బాలయ్య

ముస్తాబాద్, ఏప్రిల్ 24 : ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు ప్రతి కార్యకర్తా తరలిరావాలని పార్టీ సీనియర్ నాయకుడు కొమ్ము బాలయ్య శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ 25 సంవత్సరాల రజతోత్సవ సభకు గూడెం గ్రామం నుంచి భారీ సంఖ్యలో గ్రామస్తులు రావాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరూవాడా దండులా కదిలిరావాలి



రజతోత్సవ సభ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి రూరల్, ఏప్రిల్ 24: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు ఊరూవాడా దండులా కదిలి సభను జయప్రదం చేయాలన్నారు. ఎల్కతుర్తిలో ఏర్పాట్లను మండల ముఖ్య కార్యకర్తలతో కలిసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై కార్యకర్తలతో చర్చించారు. ఈసందర్భంగా సుంకె మాట్లాడుతూ, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఓ చారిత్రక ఘట్టంగా మిగలాలన్నారు. ప్రతి కార్యకర్తా ఒక సైనికుడిలా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ సభతో కాంగ్రెస్‌లో వెన్నులో వణుకుపుట్టాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ వైస్ ఎంపీపీ నాగయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు మహమ్మద్ అజ్జు, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, నాయకులు ముగ్ధంరవి, కమల్‌గౌడ్ తదితరులున్నారు.

## సభను విజయవంతం చేయాలి



నర్సింహులపల్లెలో జెండా గద్దెను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 24: ఎల్కతుర్తిలో ఈనెల 27న కేసీఆర్ నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న పిలుపునిచ్చారు. గురువారం తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. రజతోత్సవ సభ నేపథ్యంలో ఏర్పాట్లు, జనసమీకరణ, పార్టీ జెండా గద్దెలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 27న మండలం నుంచి సుమారు 2వేల మంది తరలించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి గ్రామం నుంచి సభకు రజతోత్సవ సభకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఈనెల 27న పార్టీ జెండాను ఆవిష్కరించి, సభకు బయలు దేరాలని సూచించారు. పార్టీ నేతలు, మాజీప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సభ విజయవంతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంద కనకరాజు గౌడ్, పలువురు పార్టీ నేతలున్నారు.

## తాగు నీరందించండి

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



9వ వార్డులో ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

గంభీరావుపేట, ఏప్రిల్ 24: 15 రోజుల నుంచి తాగునీరు రావడం లేదని గంభీరావుపేట మండల కేంద్రంలోని 9వ వార్డు మహిళలు ఆగ్రహించారు. గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ వార్డులోని బోరులో నీళ్లు లేవని, వేరేదగ్గరి నుంచి పైపు వేసినా అక్కడి నుంచి కూడా రావడం లేదని ఆవేదన చెందారు. అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగు నీటి గోస తీర్చాలని కోరారు.

# అన్నదాత ఆగమాగం

- నిన్న వడగండ్ల వానకు నేలరాలిన వరిధాన్యం
- మొన్న నీరు లేక ఎండిన పంట
- లబోదిబోమంటున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఎగ్లాస్‌పూర్‌లో కోత దశలో ఉన్న వరిపంటలో నేలరాలిన వడ్లు



వటిమల్ల గ్రామంలో రాలిన మామిడికాయలు

కోనరావుపేట, ఏప్రిల్ 24: ఆరుగాలం శ్రమించి పండించిన పంటలపై ప్రకృతి కన్నెర్రజేస్తూ అన్నదాతను ఆగమాగం చేస్తున్నది. మొన్న పంటలకు నీరు లేక ఎండిపోయి కన్నీరు పెట్టిస్తే, నిన్న పండించిన పంట రైతుల కళ్లేదుటే కన్నీటిపాలై తీరని వ్యథకు గురిచేస్తున్నది. రైతు భరోసా రాక అప్పులు తెచ్చి పెట్టుబడి పెడితే ప్రకృతి విపత్తుతో చేతికందే పెట్టుబడి కూడా నేలపాలైంది. దీంతో కోతకు వచ్చిన పంటను చూసి ముసిరిపోయిన రైతు నేడు కురుస్తున్న ఈదురుగాలులు, వడగండ్ల వానకు వడ్ల గింజలు రాలిపోవడంతో లబోదిబోమంటున్నాడు. ప్రభుత్వం పెట్టుబడిని దృష్టిలో ఉంచుకొని కనీసం పంట నష్టపరిహారం అందించాలని గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నాడు.

### వడగండ్లతో కడగండ్లు

మండలంలోని కోనరావుపేట, వటిమల్ల, ఏగ్లాస్‌పూర్, నిమ్మపల్లి గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురియడంతో రైతులకు కడగండ్లే మిగిలియాయి. చేతికొచ్చిన వరిపంటను కోసే సమయంలో బలమైన ఈదురుగాలులు వీసి రాళ్లు పడడంతో పంటంతా నేలవాలిపోవడంతోపాటు వడ్లు పూర్తిగా రాలిపోయాయి. దీంతో రైతుకు తీవ్ర నష్టం మిగిలింది. మరో వైపు పంటను కోసిన రైతు వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రాశులు పోస్తే ఆగమేఘాల మీద వచ్చిన వాన ఇసిరిసిరి కొట్టడంతో ఉన్న వడ్లు నీటిపాలయ్యాయి. కళ్లేముందే నీటిలో వడ్ల గింజలు కొట్టుకుపోతే అయ్యో దేవుడా ఎంతపని చేస్తివి అంటూ అన్నదాతలు కన్నీంటి పర్యంతమవుతున్నారు.

### నేలరాలిన మామిడి...

ఈ ఏడాది మామిడి రైతులకు దెబ్బ మీద దెబ్బ తగులుతుండడంతో కోలుకోలేని నష్టం వాటిల్లుతోంది. సాధారణంగా మే నెలలో గాలులు వీస్తాయి. కానీ ఈసారి ఏప్రిల్ మొదటి వారం నుంచే అకాల వర్షాలు, గాలు వీయడంతో రైతులు తీవ్ర నష్టపోతున్నారు. మామిడికి సరిగా పూత లేకపోవడంతోపాటు సరిగా కాత లేకుండా పోయింది. కాస్తో కూస్తో కాసిన మామిడిచెట్లకు కోతకొచ్చిన తరుణంలో ఈదురుగాలుకు నేలరాలుతున్నాయి. దీంతో రైతులు మామిడిని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

### పండించిన పంట నేలపాలు...



నాకున్న ఇరువై గుంటలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగుచేశా. బోరు మోటర్‌పై ఆధారపడి కౌలుకు తీసుకుని వరి వేస్తే కొంత మేర తడిలేక ఎండిపోయింది. మిగిలిన పంట కోత దశలో ఉండగా హార్వెస్టర్ యంత్రం కోసం ఎదురుచూస్తున్నా. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగాళ్ల వానతో వరి పంటచేనులో వడ్ల గింజలన్నీ నేలపాలయ్యాయి. ప్రభుత్వం, అధికారులు నష్టపోయిన పంటకు తగిన నష్టపరిహారం అందించాలి.

**- పసుల జలేందర్, కౌలురైతు,ఎగ్లాస్‌పూర్(కోనరావుపేట)**

### రెక్కల కష్టం నేల పాలు..



నేను నాకున్న రెండెకరాల పంట పొలంలో వరి సాగు చేశా. నాభర్త రాములుకు ఆరు సంవత్సరాలుగా ఆరోగ్యం బాగోలేక కైకిళ్లు పెట్టి వరి పంట వేస్తున్నాను. పుట్టెడు అప్పులు అయినా తెచ్చి పంటేసిన. పంట చేతికివచ్చే సమయంలో రాళ్లవాన కురిసి నాలుగు నిమిషాల్లో పంటను నాశనం చేసింది. దీంతో వరిపైరుపై వరిగింజలు నేలపాలయ్యాయి. నాలుగు నెలలు చేసిన రెక్కల కష్టంతో పాటు పంటకు పెట్టిన పెట్టుబడి, కైకిళ్లు మట్టిలో కలిసినయి. పంటలో వరిగడ్డి మిగిలిపోయింది. గవర్నమెంటు మా కష్టాన్ని చూసి ఆదుకోవాలని కోరుతున్నాను.

**-వేములవాడ ఎల్లమ్మ, నష్టపోయిన రైతు, ఎగ్లాస్‌పూర్**

### నష్టపరిహారం అందించాలి...



ఆరుగాలం శ్రమించి ఎంతో కష్టపడి నాకున్న ఎకరం భూమిలో వరి పంటను సాగుచేశా. కానీ ప్రకృతి విపత్తుతో చేతికొచ్చిన పంటంతా నేలవాలి పోయి వడ్లన్నీ రాలిపోయాయి. సుమారు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టి వడగండ్ల వానతో పూర్తిగా నష్టపోయాను. మా గ్రామంలో చాలా మంది రైతుల పరిస్థితి ఇలానే ఉంది. ప్రభుత్వం గుర్తించి నష్టపోయిన రైతులను గుర్తించి తగిన నష్టపరిహారం అందించాలి.

**-చక్రాల నర్సయ్య, రైతు, ఏగ్లాస్‌పూర్(కోనరావుపేట)**

### నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్నాం



మండలంలోని ప్రకృతి విపత్తు వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గుర్తిస్తాం. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నివేదికను రూపొందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. గ్రామాల వారీగా వ్యవసాయ విస్తారణాధికారులు పరిశీలిస్తున్నారు. వారు ఇచ్చిన నివేదిక ప్రకారం రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం.

**-సందీప్, ఏవో, కోనరావుపేట**

### కోతుల దాడిలో రైతుకు గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 24: మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రైతుపై కోతులు మూకుమ్మడిగా దాడి చేశాయి. గ్రామానికి చెందిన రైతు పుట్ట రాజారాంరెడ్డి వ్యవసాయ క్షేత్రం వద్ద కూరగాయలు సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం ఒక్కసారిగా వందలాది కోతులు పంటపై దాడి చేస్తున్నాయి. వీటిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నించగా కోతులు రైతుపై దాడికి పాల్పడ్డాయి. కోతుల దాడిలో గాయపడిన రైతు కోనరావుపేటలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. ఇప్పటికీ గ్రామస్తులతోపాటు పశువులపై దాడులు జరిగాయని, కోతుల దాడి నుంచి రక్షించాలని, ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

### మూగజీవాలకు తాగు నీరు

గంభీరావుపేట, ఏప్రిల్ 24: మండలంలోని పెద్దమ్మ అటవీ ప్రాంతంలో మూగజీవాల తాగునీటికి ఏర్పాటు చేసుకున్న తొట్టిల్లో ఎల్లారెడ్డిపేట మండల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ట్యాంకర్‌తో నీళ్లు పోశారు. ఎండలు మండిపోతున్నందున కోతులతోపాటు జీవాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యంతో తాగునీరు అందిస్తున్నామన్నారు. ఇక్కడ సత్యసాయి సేవా సమితి సభ్యులు కూర రవి, కొండ రమేశ్, బాబు, భిక్షపతి, శ్రీనివాస్, దేవేందర్, హర్షవర్దన్, స్పందన, విజయ, స్వరూప, స్వప్న తదితరులున్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 24 : జిల్లాలోని ప్రతిభావంతమైన బాలబాలికలను సత్కరించేందుకు భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డ్స్-2025 అవార్డ్‌లను అందజేస్తున్నదని దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారి పీ లక్ష్మీరాజం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుల కోసం ధైర్య సాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ & టెక్నాలజీ, పర్యావరణం, కళలు & సంస్కృతి వంటి రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదు నుంచి 18 సంవత్సరాల్లోపు బాలబాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవార్డుల కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://awards.gov.inలో ఈనెల 1 నుంచి 31.07.2025 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశాక సంబంధిత ప్రతిని కలెక్టరేట్ కార్యాలయంలో, జిల్లా సంక్షేమాధికారి, మహిళలు, పిల్లలు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ కార్యాలయంలో సమర్పించాలని ఆయన వెల్లడించారు.

### ఆలయ అభివృద్ధి పనులకు సిమెంట్ విరాళం

వేములవాడ టౌన్, ఏప్రిల్ 24 : వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయ అభివృద్ధి పనులకు బిర్లా ఏ1 అదానీ సంస్థ వారు లోడ్ సిమెంట్ బస్తాలను ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. సుమారు రూ.2 లక్షల విలువైన సిమెంట్ బస్తాలను ఆ సంస్థ అధికారులు ఈవోకు అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డీఈలు, ఏఈలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## ఎన్‌పీడీసీఎల్‌లో సెస్ విలీనానికి కుట్రలు

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



51వ సెస్ మహాజన సభలో మాట్లాడుతున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24: సెస్ సంస్థతో ఎటువంటి సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలని కుట్రలు చేస్తున్నారని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు అధ్యక్షతన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) 51వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చిక్కాల రామారావు సెస్‌తో సంబంధం లేని వ్యక్తులు సంస్థపై అసత్య ఆరోపణలు చేస్తూ ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తమ పాలకవర్గం ఉన్నంత కాలం ఎట్టి పరిస్థితుల్లోనూ ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం అనేది జరగనీయబోమని స్పష్టం చేశారు. లాభాల బాటలో ఉన్న సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎన్‌పీడీసీఎల్ గైడ్‌లైన్స్‌లోనే సంస్థ పని చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థల నుంచి భారీగా విద్యుత్ బకాయిలున్నాయని తెలిపారు. పలుచోట్ల విద్యుత్ చౌర్యం వల్ల సంస్థ నష్టాల్లోకి వెళ్లిందని, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు ఉద్యోగులు తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తమ పాలకవర్గం ఏర్పడిన తరువాత ఎటువంటి ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, ఎన్‌పీడీసీఎల్ ద్వారా నియామకాల భర్తీకి చర్యలు తీసుకుంటామని తమ ప్రమేయం ఏమాత్రం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి మాదవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, నారాయణరావు, అంజిరెడ్డి, వరుస కృష్ణహరి, మాడుగుల మల్లేశం, పొన్నాల శ్రీనివాసరావు, ఆకుల గంగారాం, నామాల ఉమ, రేగులపాటి హరిచరణ్‌రావు, కొట్టెపల్లి సుధాకర్, ఆకుల దేవరాజం, సెస్ మేనేజర్ విజయేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయులపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి



వేములవాడ టౌన్ : కొవ్వొత్తులతో ర్యాలీగా వెళ్తున్న రాజన్న ఆలయ ఉద్యోగులు,సిబ్బంది

వేములవాడ/వేములవాడ టౌన్, ఏప్రిల్ 24: కశ్మీర్‌లో భారతీయులపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. గురువారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించి, విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కటకం జనార్దన్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యానారాయణ రెడ్డి మాట్లాడుతూ, దుండగులను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, నేరెళ్ల తిరుమల్ గౌడ్, రేగుల దేవేందర్, కేశన్న గారి గోపికృష్ణ, కిషోర్ రావు, పొత్తూరు అనిల్ కుమార్, పురుషోత్తం, పిట్టల మనోహర్, పెంటరాజు, గోగికారి శ్రీనివాస్, నక్క దివాకర్, నాగుల సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వేములవాడ రాజన్న ఆలయ ఉద్యోగులు, యూనియన్ సభ్యులు గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మరణించిన వారికి నివాళులర్పించి మౌనం పాటించారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు కూరగాయల శ్రీనివాస్, వరి నర్సయ్య, ఒన్నారం భాస్కర్, రమణమూర్తి, నూగూరి నరేందర్, శ్యామ్,రాంకిషన్‌రావు, మహిపాల్‌రెడ్డి, లచ్చయ్య, సంజీవరావు, ఆలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- అవగాహన సదస్సులో ఎస్పీ మహేశ్ గితె



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ గితె

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): సిబ్బంది, అధికారుల సంక్షేమం, ఆరోగ్య భద్రతకు పోలీసు శాఖ కట్టుబడి ఉంది. వ్యక్తిగత సమస్యలుంటే నేరుగా అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ మహేశ్ గితె అన్నారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా పోలీసు కాన్ఫరెన్సు హాలులో ఎస్పీ చొరవతో సిబ్బందికి మానసిక ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించారు. ప్రముఖ మానసిక నిపుణులు డాక్టర్ అశోక్‌కుమార్ బృందం మానసిక సమస్యలపై అవగాహన కల్పించింది. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, మానసిక ఒత్తిళ్లపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిరంతర ఒత్తిడిలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి ఎలాంటి మానసిక సమస్యలు ఎదురవుతాయో, వాటిని ఎప్పకప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో సివిల్, ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బంది పాత్ర కీలకమన్నారు. అలాంటి సిబ్బంది సంక్షేమానికి తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సిబ్బంది సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆత్మహత్యల నివారణ సంస్థ చైర్మన్ డాక్టర్ అశోక్, రామకృష్ణ, సైకాలజిస్టులు శైలజ, రామోజిరావు, బోడ అరుణ, సీఐ మొగిలి, రామోహన్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంత్, ఆర్ఎస్ఐలు శ్రావణ్, సాయి, కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## చెట్లను నరికి వేయించినందుకు కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 24: గొల్లపల్లి శివారు నుంచి ఎల్లారెడ్డిపేట శివారు వరకు చెట్లను విచక్షణారహితంగా నరికి వేయించినందుకు ఇద్దరు సెస్ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం; గొల్లపల్లి కార్యదర్శి రామకృష్ణ అనుమతి లేకుండా గొల్లపల్లి మూడు గుడుల నుంచి ఎల్లారెడ్డిపేట శివారు వరకు రూ.1లక్ష విలువ చేసే చెట్లను విచక్షణారహితంగా సెస్ సిబ్బంది ద్యాప లక్ష్మణ్, దాసరి బాబు నరికి వేయించారు. కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

## వడ్లెప్పుడు కొంటరు..?

- వన్‌పల్లిలో ఏఎంసీ చైర్మన్ రాములునాయక్‌పై రైతుల ఆగ్రహం
- కొనుగోళ్లలో జాప్యంపై అసహనం



ఏఎంసీ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

వీర్నపల్లి, ఏప్రిల్ 24 : ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ మండలంలోని వన్‌పల్లి రైతులు గ్రామంలో గురువారం ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రాములునాయక్ అక్కడికి చేరుకొని వారితో మాట్లాడారు. హడావుడిగా కేంద్రాన్ని ప్రారంభించి 20రోజులు గడుస్తున్నా వడ్లెప్పుడు కొంటారని నిలదీశారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రైస్‌మిల్లర్లతో కుమ్మక్కై కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నారని ఏఎంసీ చైర్మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కాంటా చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. రేపటిలోగా ధాన్యం కాంటా పెట్టించే బాధ్యత నాదే నని ఏఎంసీ చైర్మన్ రాములునాయక్ చెప్పినప్పటికీ రైతులు సంతృప్తి చెందలేదు.

## రాజన్న తలనీలాలకు ఆరోసారి టెండర్

- రెండు సంస్థలు హాజరు
- రూ.14.1కోట్లకు పాడిన కళావతి ఎంటర్‌ప్రైజెస్
- దేవాదాయ శాఖ పరిశీలనకు పంపుతామన్న అధికారులు

వేములవాడ,ఏప్రిల్ 24: వేములవాడ రాజన్న ఆలయంలో 2025-27 సంవత్సరాలకు గాను తలనీలాల సేకరణకు గురువారం మరోసారి వేలం నిర్వహించారు. గడిచిన ఐదోసారి తమిళనాడుకు చెందిన దొరై ఎంటర్‌ప్రైజెస్ ఆన్‌లైన్ ద్వారా రూ.13.67కోట్లకు టెండర్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆరోసారి నిర్వహించిన వేలానికి హైదరాబాద్‌కు చెందిన శ్రీ వల్లభ ఎంటర్‌ప్రైజెస్, కళావతి ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు హాజరయ్యాయి. దొరై ఎంటర్‌ప్రైజెస్ పాడిన రూ.13.67కోట్ల నుంచి అధికారులు వేలం ప్రారంభించగా, వల్లభ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టర్ భువనేశ్వర్ రూ.14కోట్లకు పాడారు. అనంతరం కళావతి రూ.14కోట్లకు కాంట్రాక్టర్ ఎల్లయ్య రూ.14,01,30,900 దాకా పాడారు. ఆ తర్వాత వల్లభ ఎంటర్‌ప్రైజెస్ ముందుకు రాలేదు. 2023-25లో రూ.19కోట్ల టెండర్ వచ్చిన విషయం తెలిసిందే. అయితే అంతర్జాతీయంగా మార్కెట్ లేకపోవడంతో ఎక్కువ మొత్తంలో పాడేందుకు ఎవరూ ముందుకురావడం లేదని తెలుస్తున్నది. ఏది ఏమైనా ఐదోసారి పాడిన వారి కంటే రూ.34 లక్షలు హెచ్చు రావడంతో విషయాన్ని దేవాదాయ శాఖ కమిషనర్ పరిశీలనకు పంపుతామని ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

### క్రీడలతో మానసికోల్లాసం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 24: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ ఆహ్వానిత పోటీ ల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోవు రోజుల్లో జిల్లాలో రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీల నిర్వహణకు కృషి చేస్తానని తెలిపారు. క్రికెట్ స్టేడియంల ఏర్పాటు కోసం సిరిసిల్ల, వేములవాడ, కోరుట్ల ప్రాంతాలలో 5ఎకరాల స్థలం కేటాయింపు కోసం ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు. అనంత రం విజేత జట్టు సాట్‌తోపాటు రన్నరప్ వీబీఏ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, సెక్రటరీ అజ్మీర రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, కోశాధికారి కోడం శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, బుర్ర నారాయణగౌడ్, యెల్ల లక్ష్మీనారాయణ, కుడిక్యాల రవికుమార్, బొప్ప దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణకారులకు చేయూతనివ్వండి

ముస్తాబాద్, ఏప్రిల్ 24 : మండలంలోని స్వర్ణకారులు కుల వృత్తిని నమ్ముకొని కుటుంబాలను పోషించుకున్నామని, చేయూతనిచ్చి ఆదుకోవాలని స్వర్ణకారులు ఒక్కరోజు దీక్ష చేపట్టారు. ఇటీవల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బడా వ్యాపారుల బంగారు దుకాణాలు ఏర్పాటుకు అనుమతిస్తే మా బతుకులు మరింత దిగజారుతాయని నిరసన తెలిపారు. ఇతర రాష్ట్రాలను నుంచి వచ్చే వ్యాపారుల బంగారు నగలు విక్రయంతో కుల వృత్తిపై ఆధారపడిన మా కుటుంబాలు మరింత ఆర్థికంగా దిగజారి ఇబ్బందులు ఏర్పడుతామన్నారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు చింతోజి బాలయ్య కోరారు. ఇక్కడ స్వర్ణకారులున్నారు.

### బాధిత కుటుంబాలకు కొండూరి పరామర్శ

గంభీరావుపేట, ఏప్రిల్ 24: మండలంలోని అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన ఆయా బాధిత కుటుంబాలను నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పరామర్శించారు. మండల కేంద్రంలోని బరిగెల ప్రవీణ్, ముస్తఫానగర్‌లో చేరిపల్లి నారాయణ గురువారం మృతి చెందగా వారి నివాసంలో పార్థివ దేహాలకు కొండూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగంపేటలో బీఆర్ఎస్ నాయకుడు మామిండ్ల రాజు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా వారిని కొండూరి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. వీరితో మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, స్థానిక నేతలున్నారు.

## వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు ఒకే ఇంట్లో మృతి

- అనుమానాస్పదంగా ఘటన
- పోలీసుల విచారణ
- గజసింగవరంలో విషాదం

గంభీరావుపేట, ఏప్రిల్ 24: ఎదురెదురు కుటుంబాలకు చెందిన ఓ వ్యక్తితోపాటు వివాహిత అనుమానాస్పదంగా ఒకే ఇంట్లో మృతిచెందిన ఘటన గజసింగవరంలో గురువారం జరిగింది. కుటుంబ సభ్యులు.. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉల్లి శ్రీకాంత్(27), చెరుకూరి రేఖ (30) ఎదురెదురు ఇండ్లలో ఉంటారు. శ్రీకాంత్‌కు వివాహం కాగా, సంతానం లేరు. రేఖకు ఇద్దరు కొడుకులు కాగా భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. గురువారం శ్రీకాంత్ తన భార్యను పుట్టింటికి పంపించాడు. స్థానికులు సాయంత్రం శ్రీకాంత్ ఇంటికి వెళ్లగా, రేఖ అనుమానాస్పదంగా మృతి చెంది ఉండగా, శ్రీకాంత్ దూలానికి ఉరేసుకొని కనిపించాడు. సమాచారం మేరకు సీఐ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు. అయితే రేఖ ఒంటిపై తీవ్రమైన గాయాలున్నాయని, ఆమెను హత్య చేసి శ్రీకాంత్ ఉరేసుకున్నాడా..? లేదా..? ఇంకేదైనా జరిగిందా..? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ఇరువురి మృతికి పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.